క్లుప్తంగా

బర్డ్ ఫ్లూపై అప్రమత్తంగా ఉండాలి



చికెన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న నియాజ్

సుల్తానాబాద్: బర్డ్ ఫ్లూ పై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని చికెన్ సెంటర్లను పరిశీలించారు. చికెన్, మటన్, సెంటర్ నిర్వాహకులు దుకాణాల్లో శుభ్రత పాటించి వ్యర్థాలు నిల్వలేకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కమిషనర్ వెంట కార్యాలయ సిబ్బంది, తదితరులు పలువురు పాల్గొన్నారు.

నియామకం



రాజేందర్ కుమార్

రామగుండం: అంతర్గాం మండలం అక్బర్‌నగర్‌కు చెందిన కొండల రాజేందర్ కుమార్‌ను ఎమ్మార్పీఎస్ అనుబంధం మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈమేరకు ఎంఎస్‌పీ జాతీయ ఉపాధ్యక్షుడు రుద్రార పురాంచందర్, జిల్లా అధ్యక్షుడు మంథని చందు గురువారం నియామకపత్రంఅందజేశారు.

బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న పూర్ణ చందర్‌రావు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఎంపీడీవోగా పూర్ణ చందర్‌రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రామ్మోహన్‌రావు బదిలీపై వెళ్లారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పూర్ణ చందర్‌రావుకు మండలపరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు.

అందుబాటులో యూరియా



తనిఖీ చేస్తున్న ఏవో అనూష

ముత్తారం: మండలంలో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి అనూష తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ప్రవేట్ దుకాణాలు, ప్యాక్స్, ఏఆర్ఎస్‌కేలో 120 మెట్రిక్ టన్నుల యూరియా ఉన్నట్లు ఏవో పేర్కొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామి ఆలయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్ సిటీ టౌన్‌షిప్‌లోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. గణపతి, నాగరాజస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అయ్యప్ప పడిపూజ ఉంటుందని ఆలయ ప్రధాన గురుస్వామి ఆడెపు లక్ష్మీనారాయణ కోరారు.

సన్మానం



సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఓదెల: మండలంలోని కొలనూర్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డిని గ్రామస్తులు, నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైనందున సంజీవరెడ్డిని మాజీ సర్పంచ్ ఖైరున్నీ సాతాజ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కొంగర అనిల్ ఆధ్వర్యంలో వందమంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ వెంకన్న, సంపత్‌రెడ్డి, పుల్ల సంపత్‌రెడ్డి, కర్రె ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల: ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. గ్రామకూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లే అధికం

- మారనున్న ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు?
- అంతర్గాం మండలంలో రెండు స్థానాలు అదనం



అంతర్గాం మండల పరిషత్ కార్యాలయం

రామగుండం: ప్రభుత్వం తొలుత పరిషత్ ఎన్నికల నిర్వహణకు నిర్ణయం తీసుకోగా మండలాల పరిధిలో గ్రామాలు, ఓటర్ల వివరాలు ప్రభుత్వానికి అందించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అంతర్గాం మండల పరిధిలోని గత ఎంపీటీసీ స్థానాలతో పోల్చితే అదనంగా రెండు స్థానాలతో పాటు బీసీ కులగణన పరిగణలోకి తీసుకుంటే ఎంపీటీసీల రిజర్వేషన్లలో మార్పులు చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అంతర్గాం మండలపరిధిలో లింగాపూర్, కుందనపల్లి గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం, తర్వాత యథావిధిగా కొనసాగించడంతో గడిచిన ఐదేళ్లు ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగింది. గతంలో ఈ రెండు గ్రామాలకు ఒక ఎంపీటీసీ స్థానం ఉండగా ప్రస్తుతం రెండు ఎంపీటీసీ స్థానాలుగా గుర్తించారు. గత ఎన్నికల్లో రెండు గ్రామాలను తొలగించి ఐదు ఎంపీటీసీ స్థానాలతో ఎన్నికలు నిర్వహించారు. ఈ క్రమంలో పరిషత్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పంచాయతీరాజ్ అధికారులు అంతర్గాంలో కుందనపల్లి, లింగాపూర్ గ్రామాలను వేర్వేరుగా పరిగణలోకి తీసుకొని రెండు స్థానాలుగా నిర్ణయించడంతో మండల పరిధిలో మొత్తం ఏడు స్థానాలకు పెరిగాయి.

మహిళల ఓట్లే ఎక్కువ

అంతర్గాం మండల పరిధిలో బ్రాహ్మణపల్లి, పొట్యాల, ముర్మూర్, గోలివాడ, పెద్దంపేట, కుందనపల్లి, లింగాపూర్ ఎంపీటీసీ స్థానాలుగా నిర్ణయించారు. అంతర్గాం మండల పరిషత్‌లో మొత్తం ఓటర్లు 20,775 కాగా ఇందులో మహిళలు 10,612, పురుషులు 10,162. మండలవ్యాప్తంగా 450 మంది మహిళా ఓటర్లు అధికం. ఇందులో ప్రతీ స్థానం పరిధిలోకి వచ్చే పరిశీలిస్తే..

- **బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ స్థానంలో**
  బ్రాహ్మణపల్లి, ఎగ్లాస్‌పూర్, ఆకెనపల్లి, సోమనపల్లి గ్రామాలు. మొత్తం ఓటర్లు 3,858, మహిళలు 1,976, పురుషులు 1,882. ఈ స్థానంలో 94 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.
- **పొట్యాల ఎంపీటీసీ స్థానం**
  పొట్యాల, విసంపేట, మద్దిర్యాల గ్రామాలున్నాయి. మొత్తం ఓటర్లు 2,795. మహిళలు 1,438, పురుషులు 1,357. ఈ స్థానంలో 81 మంది మహిళా ఓటర్లు అధికం.
- **ముర్మూర్ ఎంపీటీసీ స్థానంలో**
  ముర్మూర్, ఎల్లంపల్లి గ్రామాలుండగా మొత్తం ఓటర్లు 3,322. మహిళలు 1,686, పురుషులు 1,636. ఈ స్థానంలో 50 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు.
- **గోలివాడ ఎంపీటీసీ స్థానం**
  గోలివాడ, అంతర్గాం, టీటీఎస్ అంతర్గాం గ్రామాలున్నాయి. మొత్తం ఓటర్లు 3,487. మహిళలు 1,769, పురుషులు 1,718. ఈ స్థానంలో 51 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.
- **పెద్దంపేట ఎంపీటీసీ స్థానం**
  పెద్దంపేట, రాయదండి గ్రామాలు. మొత్తం ఓటర్లు 2,753. మహిళలు 1,402, పురుషులు 1,351. ఈ స్థానంలో 51 మహిళా ఓటర్లు ఎక్కువ.
- **కుందనపల్లి ఎంపీటీసీ స్థానం**
  ఓటర్ల సంఖ్య 2,817. మహిళలు 1,406, పురుషులు 1,410 మంది కాగా కేవలం ఇందులో నలుగురు మాత్రమే పురుషులు ఎక్కువ.
- **లింగాపూర్ ఎంపీటీసీ స్థానం**
  ఓటర్ల సంఖ్య 1,743. మహిళలు 935, పురుషులు 808. ఇందులో 127 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

ఏడు ఎంపీటీసీ స్థానాలకు ఎన్నిక



అంతర్గాం మండల పరిధిలో కుందనపల్లి, లింగాపూర్ గ్రామాల విలీన ప్రతిపాదనల విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదు. మండల పరిధిలో గతంతో పోల్చితే అదనంగా కుందనపల్లి, లింగాపూర్ గ్రామాలు వేర్వేరుగా రెండు ఎంపీటీసీ స్థానాలుగా ప్రభుత్వం గుర్తించింది. తమకు అందిన నివేదిక ఆధారంగా ఏడు స్థానాల్లో ఎంపీటీసీ ఎన్నికలు జరుగుతాయి.

– వేణుమాధవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, అంతర్గాం

సభను విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ మంథని డివిజన్ కార్యదర్శి అశోక్ పిలుపునిచ్చారు. గురువారం యైటింక్లయిన్‌కాలనీ, పోతనకాలనీ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో పోస్టర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను అమలుచేయాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ నిరసన, బహిరంగ సభలో అన్నివర్గాల ప్రజలు, కార్మికులు పాల్గొనాలన్నారు. నాయకులు రాజేశ్, మల్లేశ్, నాగేశ్, వెంకటస్వామి, పద్మ, సులోచన, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'అర్చకుడిపై దాడి హేయమైన చర్య'

సుల్తానాబాద్‌రూరల్: చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగారాజన్‌పై దాడి హేయమైన చర్య అని పెద్దపల్లి జిల్లా శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు కాండూరి వాసు అన్నారు. దాడిచేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



కనగర్తిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై రమేశ్

ఓదెల: రోడ్డు ప్రమాదాల జరుగకుండా పొత్కపల్లి పోలీసులు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగా మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనగర్తిలో ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సుల్తానాబాద్ నుంచి కనగర్తి మీదుగా జమ్మికుంటకు వెళ్లే వాహనాల స్పీడ్‌ను తగ్గించి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థులు ఆందోళన చెందొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిల్లేశ్వర్‌రెడ్డి

ధర్మారం: పరీక్ష సమయంలో విద్యార్థులు ఆందోళనకు గురికావద్దని పెరిమిటీ జ్ఞానం గురూజీ డిల్లేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికావద్దన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం 41 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. మండల విద్యాధికారి ప్రభాకర్, క్లబ్ అధ్యక్షుడు రవీందర్‌శెట్టి, క్లబ్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జోన్ చైర్మన్ డాక్టర్ కామిని శ్రీనివాస్.కార్యదర్శి ముజాహిద్, ట్రెజరర్ కట్ట రమేశ్, మిట్టపల్లి చంద్రకాంత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు మాలతి, ఇన్‌చార్జి అరుణ, అంజయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు , తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి : ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ నాయకురాలు, మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలితా కూర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై వివరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. అనంతరం కూలీలకు స్వీట్లు, మజ్జిగ పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠుపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యసిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: కుష్ఠు రహిత సమాజ నిర్మాణానికి కృషిచేయాలని పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి విద్యార్థులకు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని కేజీబీవీలో కుష్ఠ వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుష్ఠువ్యాధి సోకిన వారికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రినిసిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, ఆశాలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై రమేశ్

ఓదెల: ప్రతిఒక్కరూ సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. మండలంలోని పొత్కపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రిచవచ్చన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం గ్రామస్తులు ముందుకు రావాలన్నారు.

అల్లుకున్న తీగను తొలగించారు

సాక్షి స్పందన

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ తొలగించండి అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. విద్యుత్ సిబ్బంది వెంటనే తీగను తొలగించారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



పోలింగ్ కేంద్రాలు పెంచాలి

కమాన్‌పూర్: మండలంలోని కమాన్‌పూర్, గుండారం గ్రామాల్లో ఓటర్లు అధికంగా ఉన్న నేపథ్యంలో పోలింగ్‌కేంద్రాలు పెంచాలని కోరుతూ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ గురువారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. పోలింగ్ రోజు ఓటర్లు ఓట్లు వేసేందుకు క్యూలైన్‌లో గంటల తరబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కమాన్‌పూర్‌లో 2, గుండారంలో 2 నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పెగడపల్లి నుంచి సబ్‌స్టేషన్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఎండిన చెట్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎండినర చెట్లు ఎప్పుడు కూలి మీద పడతాయోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఎండిపోయి మోడువారిన చెట్లు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
బాపుసింగ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సెల్‌నంబర్: 9440818089

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 9849971500

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

- మున్సిపల్ కమిషనర్ మనోహర్

మంథని: మహిళలు అన్నింట్లో ఆర్థికాభివృద్ధి సాధించాలని మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. గురువారం మంథనిలోని సమావేశ మందిరంలో మెప్మా ఆర్పీలు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. తెల్లరేషన్ కార్డు ఉండి 18 ఏళ్లు పైబడిన మహిళలను గుర్తించి స్వశక్తి సంఘాలతో కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. స్వశక్తి సంఘాలకు స్త్రీనిధి రుణ సదుపాయం తక్కువ వడ్డీకి అందుతుందని, మహిళలు వినియోగించుకోవాలని శ్రీ నిధి ఆర్ఎం దుర్గా ప్రసాద్ దుర్గాప్రసాద్ కోరారు. బకాయిలు వందశాతం రికవరీ చేయాలని సూచించారు. డీఎంసీ సతీశ్‌బాబు, మున్సిపల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ బందం లావణ్య శ్రీనిధి మేనేజర్ శోభ, తదితరులు ఉన్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న భాస్కర్ రావు

ఎలిగేడు: వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్, ముప్పిరితోట గ్రామాల్లో పారిశుధ్య పనులు, మంచినీటి పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఆరిఫ్ ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం



మంథని: మాట్లాడుతున్న ఎంపీడీవో శశికళ



జూలపల్లి: నాయకులతో సమావేశమైన అధికారులు

మంథని: మంథని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో శశికళ సమావేశమయ్యారు. మండలంలోని పోలింగ్‌స్టేషన్ల ముసాయిదా, జాబితాపై నాయకులతో చర్చించారు. ఆయా పార్టీల నాయకులు ఐలి ప్రసాద్. జనగామ రవికుమార్, బూడిద గణేశ్, పుప్పాల తిరుపతి, బూడిద రాజు, పర్సవేన మోహన్ తదితరులున్నారు.

జూలపల్లి: రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయంలో రాజకీయ పార్టీలు, మండలస్థాయి నాయకులతో ఎంపీవో అనిల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్‌స్టేషన్లు, దాని పరిధిలో ఉన్న ఓటర్లపై నాయకులకు అవగాహన కల్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్, బీఎస్పీ ఇన్‌చార్జి కొమురయ్య, నాయకులు బొజ్జ సంపత్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామస్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలనపడిన 'చెత్త' వాహనం



ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం గుంటూరుపల్లి గ్రామంలో కొన్నేళ్లుగా చెత్త తరలింపు వాహనం మూలన పడింది. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్డుపై చెత్త దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి చెత్త తరలించే వాహనాన్ని మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'పది' ఇంటర్నల్ మార్కుల పరిశీలన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల (ఫార్మేటివ్ అసెస్మెంట్)ను పరిశీలించినట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు